క్లుప్తంగా

లయన్స్ ఆధ్వర్యంలో పేరెంట్స్ డే



బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న సీఎస్ఐ చర్చిలో నేషనల్ పేరెంట్స్‌డేను లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అపెక్స్ వైట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులను పిల్లలు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు జెరూషా, జోన్ చైర్మన్ లంక రవి, సభ్యులు పి నాగభూషణం, చర్చి ప్రతినిధులు అమృతరావు, పాపారావు, స్వామిదాస్, విజయ్, మల్లేశ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వర్షాలకు కూలిన మూడు ఇళ్లు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూడు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన గోలిఅమ్మాయి, కంటం దేవాయి, చెన్న నర్సులకు చెందిన ఇళ్లు పాక్షికంగా కూలి పోయాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సునీల్‌రెడ్డి ఆర్థికసాయం



మండల కేంద్రంలో వర్షాలకు ఇళ్లు కూలిపోయిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి రూ. పది వేల చొప్పున ముగ్గురికి ఆర్థికసాయం స్థానిక నాయకుల ద్వారా అందేలా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మొక్కల పంపిణీ



భీమ్‌గల్: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని 5, 9, 11, 12 వార్డుల్లో కౌన్సిలర్లు కాలనీవాసులకు ఆదివారం మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లెల లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



పెర్కిట్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన పట్టణంలోని తన ఇంటి ఆవరణలో తల్లి బాల సరస్వతితో కలిసి ఆదివారం మొక్క నాటారు. భావితరాల భవిష్యతుకు బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

రాయల సంతాప సభ



నందిపేట్: మండలంలోని వెల్మల్‌లో సీపీఐఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో రాయల చంద్రశేఖర్ సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు బైనచిన్న మల్లయ్య, రాజలింగం, వెంకటి, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మాక్లూర్: జనాభా ప్రతిపాదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రమావత్ సురేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. అలాగే జీపీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డి రమేశ్, రవి, వినోద్, చింత ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఎత్తొండలో బోనమెత్తుకున్న ఏనుగు రవీందర్‌రెడ్డి



అమ్దాపూర్‌లో బోనాలతో గ్రామస్తులు



బాల్కొండ మండలం కృష్ణవేణి పాఠశాలలో ..



రుద్రూర్‌లో బోనాలతో భక్తులు



సాలూరలో మహాలక్ష్మి మందిరానికి బోనం ఎత్తుకుని పొలం గట్టు మీదుగా వెళ్తున్న భక్తులు



రుద్రూర్‌లో పోతరాజులతో భక్తులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అలరించిన పోతరాజుల విన్యాసాలు

బోధన్‌టౌన్/ కోటగిరి/ బోధన్ రూరల్/ బాల్కొండ/ బోధన్/ రుద్రూర్/ భీమ్‌గల్: పలు గ్రామాలు, పట్టణాల్లో బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు బోనాలను ఎత్తుకొని గ్రామ దేవతలకు సమర్పించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బోధన్‌లోని ఆచన్‌పల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. శక్కర్‌నగర్, పోలీస్‌కాలనీలో మహిళలు బోనాలను ఊరేగించారు. కోటగిరి మండలం ఎత్తొండలో కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి బోనం ఎత్తుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో, బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లో, బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో, బోనాల పండుగ నిర్వహించారు. సాలూర మండల శివారులోని మహాలక్ష్మి అమ్మవారి మందిరానికి పొలం గట్టు మీదుగా భక్తులు వరుస క్రమంలో బోనం ఎత్తుకుని చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో, భీమ్‌గల్ మండలంలోని మెండోరాలో బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.



బోధన్ పట్టణం పోలీస్ కాలనీలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



సాలూరలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు



బోనాల ఊరేగింపులో మాజీ ప్రజాప్రతినిధులు



ఆచన్‌పల్లిలో బోనం ఎత్తుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్‌రెడ్డి



శక్కర్‌నగర్ కాలనీలో బోనాలతో మహిళలు

గ్రామదేవతలకు పూజలు



నల్లపోచమ్మ ఆలయం ఎదుట క్యూ కట్టిన భక్తులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గ్రామదేవతలకు పుర ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మతల్లి, మహాలక్ష్మిమాత ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు అందంగా ముస్తాబు చేశారు. భక్తులు ఆదివారం ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో వన భోజనాలు



ఆలూర్‌లో వన భోజనాలు చేస్తున్న గ్రామస్తులు

పెర్కిట్/ ఎడపల్లి: ఆర్మూర్‌తో పాటు ఆలూర్, ఎడపల్లి మండలాల్లో ఆదివారం వన భోజనాల సందడి నెలకొంది. ఆషాడమాసం చివరి ఆదివారం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేకపూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఆట పాటలతో సంతోషంగా గడిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఆర్మూర్‌టౌన్: నియోజకవర్గ అభివృద్ధికి ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లను, స్టాఫ్ నర్సులను నియమించాలని వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే కలిసి కోరినట్లు పేర్కొన్నారు. స్పందించిన మంత్రి ఆరోగ్య సిబ్బందిని నియమించడం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తాము చేసినట్లు ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. దీనిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. సమావేశానికి ముందు క్యాంప్ కార్యాలయంలో ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అలాగే గ్రామదేవతల వద్ద హాలాల్‌ను నిషేధించిన సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజును బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, ద్యాగ ఉదయ్, కంచెట్టి గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, కలిగోట గంగాధర్, ఆకుల శ్రీనివాస్, పులియగేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హామీల అమలుకు నిధుల కేటాయింపులేవి?

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

బోధన్: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఆసరా పింఛన్లు, మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఆర్థికసాయానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేవని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ప్రశ్నించారు. మూతపడిన నిజాంషుగర్స్‌ను తిరిగి తెరిపిస్తామని ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ముందుగా బోధన్ ఫ్యాక్టరీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన డివిజన్ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చెబుతున్న సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ వట్టి బూటకమని, ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇందుకు రుజువు చేస్తోందన్నారు. పార్టీ జిల్లా, డివిజన్ ప్రతినిధులు శంకర్ గౌడ్, యేశాల గంగాధర్, నన్నేసాబ్, బాలయ్య, సాయిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ సభ్యులు స్వచ్ఛ కాలనీ, సమైఖ్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నిల్వ ఉన్న నీటిని తొలగించారు. చిల్డ్రన్ పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. కెనాల్ కట్టపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కొక్కెర భూమన్న, గడ్డం శంకర్, ఎల్‌టీ కుమార్, కొంతం రాజు, సాయన్న, ఎర్ర భూమయ్య, గణేశ్, నల్ల సాయన్న పాల్గొన్నారు.



రోడ్లపై నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న సభ్యులు

సీఎస్ఐ చర్చిలో మ్యారేజ్ సండే

పెర్కిట్: పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో ఆదివారం ఘనంగా వివాహ ఆదివారం ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ మన్నె శ్రీనివాస్ వివాహ జంటలతో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఏసు ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టరేట్ కమిటీ సభ్యులు జీ నవనీత్ రాజ్, జెస్సీ బాబు, గ్రేస్ నిర్మల, ఎస్తేర్ నాగమణి, శంకర్ ప్రశాంత్, నయిని జనార్దన్, సిరిపురం సుందర్ రాజ్, ఎంసీ ఓబన్న, ఐ నందం తదితరులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఇదీ అంతర్రాష్ట్ర రహదారే..

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బురదమయమైన అంతర్రాష్ట్ర బీటీ రోడ్డు



నాగన్‌పల్లి నుంచి బోధన్ వైపు వెళ్లే అంతర్రాష్ట్ర బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

బోధన్: మండలంలోని నాగన్‌పల్లి నుంచి పట్టణ కేంద్రానికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్రాష్ట్ర రోడ్డు అధ్వానంగా మారింది. ఏ మాత్రం ఆదమరిచి వాహనాల నడిపినా ప్రమాదబారిన పడి ప్రాణాలకు ముప్పు వచ్చే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభంలో రోడ్డుకు గుంతలు ఏర్పడగా మొరంతో పూడ్చారు. ప్రస్తుతం వర్షానికి మొరం కొట్టుకుపోవడంతో గుంతలు తేలాయి. రాత్రి వేళల్లో గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాటిపై ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలు బోధన్ పట్టణ కేంద్రానికి ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తారు.

సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంత జాతీయ రహదారికి అనుసంధానంగా బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతరాష్ట్ర చెక్ పోస్టు వరకు వయా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా 8.5 కిలో మీటర్ల పొడువున నాలుగు లైన్ల బీటీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాగన్‌పల్లి శివారులో బైపాస్ రోడ్డు, పసుపు వాగుపై కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనాల రవాణా పాత బీటీ రోడ్డు మీదుగానే సాగుతోంది. అంతర్రాష్ట్ర రోడ్డు నిర్వహణ, పర్యవేక్షణ నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి వెళ్లింది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

సర్కస్ ఫీట్లు చేయాల్సిందే

మా ఊరు నుంచి బోధన్ వెళ్లే దారిలో కిలో మీటరు పొడువున ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. గుంతల రోడ్డుతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– నాగరాజ్, గ్రామస్తుడు, నాగన్‌పల్లి

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం

- రూ. కోట్లతో చేసిన అభివృద్ధి మూణ్నాళ్ల ముచ్చటే
- అధికారుల సూచనలు పట్టించుకోని యజమానులు
- ధ్వంసమవుతున్న రోడ్లు

భీమ్‌గల్: దమ్ము చక్రాల తాకిడికి రూ. కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన రోడ్లు ఛిద్రమవుతున్నాయి. వేసిన రహదారులు మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. రోడ్లపై కేజ్‌వీల్‌తో నడపొద్దని సంబంధిత అధికారులు సూచించినా రైతుల్లో మార్పు రావడం లేదు. ఒకవేళ దమ్ము చక్రాలతో రోడ్డుపైకి ఎక్కాల్సి వస్తే వాటికి పట్టీలు బిగించుకోవాలని ఆర్ అండ్‌బీ అధికారులు, పోలీసులు ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పిస్తున్నా రైతుల్లో మార్పు రావడం లేదు. దీంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బడా భీమ్‌గల్ నుంచి రూప్ల తండాకు వెళ్లే రోడ్డు, జాగిర్యాల్ నుంచి కుప్కల్ వెళ్లే రోడ్డు, దేవన్‌పల్లిలోని రోడ్డు, బాబానగర్ నుంచి మెండోరా వెళ్లే రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే జరిమానాలు విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి చేపట్టిన రోడ్లు ఛిద్రమవుతున్నాయి.



కేజ్‌వీల్‌తో ధ్వంసమైన తారు రోడ్డు

రోడ్డుపై నేలకూలిన చెట్టు

డిచ్‌పల్లి: శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన గల చెట్టు నేలకూలింది. టీఎస్ఎస్‌పీ ఏడవ బెటాయలిన్ నుంచి ఖిల్లా గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న చెట్టు సగం రోడ్డుపై పడిపోవడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తులు ఆదివారం చెట్టును రోడ్డు నుంచి పక్కకు తొలగించారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గల్లీ గ్యాంగ్‌స్టార్ (తెలుగు) – 12.40, పురుషోత్తముడు – 4.00, 7.10, ఆపరేషన్ రావన్ (తెలుగు) – 10.20
స్క్రీన్-2 –	డెడ్‌పూల్ 3డీ (తెలుగు)– 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-3 –	రాయన్ (తెలుగు) – 01.00, 4.10, 7.20, 10.30
స్క్రీన్-4 –	రాయన్ (తెలుగు) – 11.20, కల్కి 2898 ఏడీ (తెలుగు) – 2.30, 6.15, 10.00

ఊట్‌పల్లిలో ఘనంగా తీజ్



ఊట్‌పల్లిలో ఉత్సవాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లిలో తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం తీజ్ ఉత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు బుట్టల్లో పెంచిన గోధుమ మొలకలను యువతులు తమ తలపై పెట్టుకొని నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నరేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.